సాక్షి సిద్దిపేట

సోమవారం । 17 । జూన్ । 2024



డేంజర్.. పూల్

స్విమ్మింగ్ పూల్‌ల నిర్వహణను గాలికి వదిలేశారు. నిబంధనలు విస్మరించి డబ్బు సంపాదనే లక్ష్యంగా కొనసాగిస్తున్నారు.

వివరాలు 8లో



వర్షాకాలం పాములతో పైలం

వానాకాలంలో పాములు ఎక్కువగా సంచరిస్తాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వివరాలు 8లో ▸



పొంచివున్న ప్రమాదం

మల్లంపల్లి చెరువు కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో నేడు జరిగే ప్రజావాణి రద్దు అయ్యింది. బక్రీద్ పండుగ, ప్రభుత్వ సెలవు ఉన్నందున కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె జీవన్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఎస్‌ఎస్‌యూఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన జీవన్ మాట్లాడుతూ జాతీయ స్థాయి నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోయారని అన్నారు. విద్యారంగంలో ఏమైన సమస్యలు ఉంటే ఎస్‌ఎస్‌యూఐ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రశాద్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మత్, దావూద్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు సనత్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్, దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాహిద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాను, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై కుట్రలను సహించం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విద్యుత్ కమిషన్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ప్రజల్లో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. నిరాధారమైన ఆరోపణలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు అంశాన్ని పక్కనబెట్టి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఏదో ఒక అంశాన్ని బయటకు తెస్తుందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అంటూ, కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయంటూ బీఆర్‌ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. కాంగ్రెస్ నేతల వైఖరిని ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని తెలిపారు. రాబోవు రోజుల్లో ప్రజల నుంచి నిరసన ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

నారాయణఖేడ్: జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లో నియోజకవర్గ స్థాయి మాదిగ జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్లలో భాగంగా 7 శాతం మాత్రమే కల్పిస్తున్నందున మాదిగలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రిజర్వేషన్ పెంపుపై చర్య తీసుకోవాలని కోరారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడిపల్లి రమేష్, మనోహన్, అలిగే జీవన్, ప్రసాద్, ఏసుదాస్, సుకుమార్, తుకారాం పాల్గొన్నారు.

చేయూత

గజ్వేల్‌రూరల్: నిరుపేద కుటుంబానికి ఆర్య వైశ్య సంఘం జిల్లా నాయకులు చేయూతనందించారు. మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద కుటుంబానికి చెందిన నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఉత్తునూరి సంపత్‌గుప్త ఆదివారం ఐవీఎఫ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మనోధైర్యం నింపారు.

వర్షాలు లేటు.. పత్తికి చేటు

విత్తనం మొలకెత్తక రైతుల ఆందోళన

- సీజన్ ఆరంభంలోనే ప్రతికూల పరిస్థితులు
- ఇప్పటికే 60వేల ఎకరాలకుపైగా సాగులోకి
- 1.80లక్షల ఎకరాల్లో సాగు అంచనా

పక్క ఫొటోలో ఉన్న రైతు పేరు జూపల్లి సత్యనారాయణ. ఈయనది గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామం. తనకున్న ఆరు ఎకరాల్లో 15రోజుల క్రితం పత్తి విత్తనాలు వేశారు. వర్షం లేక ఇప్పటివరకు మొలక రాలేదు. వర్షం కోసం రోజూ ఎదురు చూస్తూనే ఉన్నారు. విత్తనం చెడగొట్టి వర్షం కురిసిన తరువాత మళ్లీ వేయక తప్పేటట్టులేదని చెబుతున్నారు. ఈ పరిస్థితి సత్యనారాయణదే కాదు.. జిల్లాలోని పత్తి రైతులంతా ఇదేరకమైన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్ ఆరంభంలోనే ప్రతికూలపరిస్థితులు చుట్టుముట్టడం ఆందోళన కలిగిస్తోంది

\- గజ్వేల్



వర్షాలు ఆలస్యమవుతుండటంతో పత్తి రైతులు కలవరానికి గురవుతున్నారు. సహజంగా అన్ని పంటలకంటే పత్తి విత్తనాలు ముందుగానే వేయడం ఆనవాయితీ. పదును లేకున్నా.. మరి కొద్ది రోజుల్లో వర్షాలు కురుస్తాయనే ఆశతో వేసిన విత్తు మొలకెత్తక దిగాలు చెందుతున్నారు. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే కోట్ల విలువైన విత్తనం నేలపాలు కానుంది.

పత్తి వైపే రైతుల మొగ్గు..

జిల్లాలో ఈసారి 5.50లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. ఇందులో భాగంగానే ప్రధాన పంటలైన వరి 3లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 60వేలు, 10వేల ఎకరాల్లో కంది సాగులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. పత్తి మాత్రం 1.80లక్షల ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. అంచనాలకు మించి పత్తి సాగు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈసారి పత్తికి మద్దతు ధర మరింతగా పెరగవచ్చుననే ఆశతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తిని సాగు చేస్తే పెట్టుబడులు పోనూ ఎంతో కొంత మిగులుబాటు ఉంటుందన్న భావన రైతుల్లో వ్యక్తమవుతున్నది. జిల్లాలో 3లక్షల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉండగా.. ఇప్పటికే 2లక్షల విత్తన ప్యాకెట్ల కొనుగోళ్లు జరిగాయి. వ్యవసాయశాఖ లెక్క ప్రకారం ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున వాడతారు. ఈ లెక్కన 1.50లక్షల ఎకరాల సరిపడా విత్తనం ఇప్పటికే అమ్మకాలు జరిగాయన్నమాట. ఇందులో ఇప్పటివరకు 60వేల ఎకరాలకుపైగా పత్తి సాగులోకి వచ్చిందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. నిజానికి సీజన్ ఆరంభం నుంచి ఇప్పటివరకు భారీ వర్షాలే లేవు. జూన్ నెలలో 104మి.మీల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 53.4మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీనిని బట్టి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పదును ఉంటేనే విత్తనం వేయాలి



నేలలో పదును లేకుండా పత్తి విత్తనాలు వేయడం సరికాదు. రైతులు సహజంగా వర్షాలు వస్తాయి కదా...అని ముందుగానే విత్తుతుంటారు. వర్షాలు లేట్టైతే ఇబ్బంది తప్పదు. ఇప్పటివరకు జిల్లాలో 60వేల ఎకరాల వరకు పత్తి సాగులోకి వచ్చింది. ఇందులో కొంత మొలకెత్తలేదు. ఒకటిరెండ్రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- మహేశ్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

రేపోమాపో వర్షాలు పడకపోతాయా.. అనే ధీమాతో నల్ల రేగడితోపాటు చెలకల్లో సైతం ముందస్తుగా పత్తి విత్తనాలు వేశారు. తీరా అవి మొలకెత్తక కలవరానికి గురవుతున్నారు. నిత్యం ఆకాశం వైపు రైతన్నలు చూస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్లలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నది.

ఆకాశం వైపు రైతు చూపు

ఈ డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురవడం వల్ల ఇప్పటివరకు విత్తనం వేసిన 60వేల ఎకరాల్లో సగం మాత్రమే మొలకలు వచ్చాయి. మిగిలిన 30వేల ఎకరాల్లో నేల పాలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. గతే డాది మాదిరిగానే ఈసారి కూడా వర్షం దోబు చులాడటం రైతులకు కుంగదీస్తున్నది. ఒకటిరెండ్రోజుల్లో భారీ వర్షం రాకపోతే మాత్రం రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనపడుతోంది.

ప్రభుత్వ వ్యవహారాల్లో మతం తగదు

- ఇది ఫ్యూడల్ వ్యవస్థకు తార్కాణం
- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం
- గజ్వేల్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు



విద్యాసదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కాశీం

గజ్వేల్: 'ప్రభుత్వ వ్యవహారాల్లో మతాన్ని తీసుకురావద్దు. రాజ్యాంగ నిబంధనను ధిక్కరించి నేటి పాలకులు ఫ్యూడల్ వ్యవస్థకు నాందిపలుకుతున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామం కాదు' అని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసదస్సుకు ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సంక్షోభంలో సామాజిక విలువలు' అంశంపై కాశీం ప్రసంగించారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున పండితులను ఆహ్వానించారని గుర్తు చేశారు. ఇలా చేయడం ద్వారా మతానికి విస్తృత ప్రాధాన్యత కల్పిస్తూ ఫ్యూడల్ సమాజం వైపు బాటలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధినేతలే దేవుడి బిడ్డలుగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ప్రసంగిస్తూ నేటి సమాజంలో అందరికీ సమానమైన విద్యావకాశాలు అందే పరిస్థితి రావాలన్నారు. పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ల మాదిరిగా సమాజ మార్పు కోసం పనిచేసే కల్చరల్ టీచర్ల వ్యవస్థ కూడా రావాలని, ఈ దిశగా ప్రభుత్వంపై ఉపాధ్యాయులు ఒత్తిడి పెంచాలని కోరారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలపైనా టీపీటీఎఫ్ పోరాటం చేస్తోందని చెప్పారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాంచంద్రం, రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌తోపాటు గజ్వేల్ జోన్ పరిధిలోని నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు ప్రకాశ్‌రావుకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి తండ్రి రియల్ హీరోనే..

గజ్వేల్‌రూరల్: ప్రతి తండ్రి తమ పిల్లలకు రియల్ హీరోనే అని మాల మహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ అన్నారు. ఫాదర్స్‌డే సందర్భంగా ఆదివారం రాత్రి గజ్వేల్‌లో తన తండ్రి రామయ్యకు ఫాదర్స్‌డే కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఆధార కుటుంబంపై బతుకులను సాగించిన తీరు తాము మరిచిపోలేమన్నారు. కుటుంబాన్ని భుజానికెత్తుకొని పిల్లల భవిష్యత్ కోసం బంగారు బాటలు వేసిన తీరు అమోఘమన్నారు.



తండ్రి రామయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

వ్యవసాయ కళాశాల పిలుస్తోంది

- తునికి విజ్ఞాన జ్యోతిలో 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాలిటెక్నిక్‌లో 90, ఇంజనీరింగ్‌లో 30 సీట్లు



కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయ విద్య నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు మంచి అవకాశం. మీ కోసం విజ్ఞాన జ్యోతి వ్యవసాయ కళాశాల ఎదురు చూస్తోంది. కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ, వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయ విద్య అందిస్తోంది. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో సుమారు 105 మంది ప్రస్తుతం ఏఈఓలుగా వివిధ జిల్లాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. సొంతగా వ్యవసాయం చేయడంతో పాటు ప్రైవేట్ కంపెనీలలో ఎందరో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ వ్యవసాయ పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌తో పాటు ఆరునెలల ఉచిత శిక్షణ సైతం ఇస్తున్నారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులై, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పాలిసెట్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వారికి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

30 ఎకరాల్లో వ్యవసాయ క్షేత్రం

ప్రముఖ సినీ నిర్మాత దివంగత డాక్టర్ రామానాయుడు తునికి వద్ద గల తన సొంత భూమి 30 ఎకరాలను విజ్ఞాన జ్యోతి సంస్థకు ఇచ్చారు. దీంతో ఇక్కడ విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థను ఏర్పాటు చేసి మొదట్లో గ్రామీణ యువతకు ఏడాది, తర్వాత ఆరునెలల ఉచిత వ్యవసాయ విద్యను అందిస్తున్నారు.



వరినాట్లు వేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ప్రతి విద్యార్థి సాగు చేయాలి

వ్యవసాయ కళాశాలలో చేరిన విద్యార్థులు కళాశాల హాస్టల్‌లో ఉంటూ క్షేత్రస్థాయిలో వ్యవసాయం చేయాల్సి ఉంటుంది. ప్రిన్సిపాల్, లెక్చరర్లు స్థానికంగా అందుబాటులో ఉండి విద్యాబోధనతో పాటు వ్యవసాయంలో మెలకువలు నేర్పిస్తారు. రెండేళ్ల వ్యవసాయ పాలిటెక్నిక్, మూడేళ్ల ఇంజనీరింగ్ కోర్సుల్లో దుక్కి దున్నింది మొదలు పంట కోత పూర్తయ్యే వరకు అవగాహన కల్పిస్తారు. వరితో పాటు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, జొన్న, సిరిధాన్యాలు రాగులు, సజ్జలు, పప్పు ధాన్యాలు, కూరగాయల సాగు చేయనున్నారు. దీంతో పాటు పశుపోషణ, పాడి అభివృద్ధి తదితర అంశాలు నేర్పిస్తారు. పంటల సాగులో వచ్చిన ఆదాయాన్ని విద్యార్థులకు సమానంగా పంచి ఇస్తారు.



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

వ్రత శోభితం.. అక్షర వైభవం

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి వ్రతాలతో శోభిల్లింది. వర్గల్ విద్యాసరస్వతి సన్నిధానం అక్షర పూజలతో అలరారింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో వర్గల్, నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రాలు కిటకిటలాడాయి. నాచగిరికి ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు సత్యదేవుని వ్రతాలు, స్వామివారికి అభిషేకాలు, కల్యాణాలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని తరించారు. క్షేత్రంలో 18 వ్రతాలు, 15 నిజాభిషేకాలు, 5 కల్యాణాలు జరిగినట్లు ఈఓ అన్నపూర్ణ తెలిపారు.

సరస్వతి సన్నిధిలో అక్షరాభ్యాసాల వెల్లువ

విద్యాసరస్వతి క్షేత్రం అక్షరాభ్యాసాలతో వెల్లువెత్తింది. చిన్నారులతో అక్షర పూజలు జరిపించి అక్షర స్వీకారాలు చేయించారు. దాదాపు 700 అక్షరాభ్యాసాలు జరిగాయి. 10 వేలమంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ మేనేజర్ రఘుపవన్ పేర్కొన్నారు.



వర్గల్ క్షేత్రంలో చిన్నారుల అక్షరస్వీకారాల సందడి

పోచమ్మకు బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, తిమ్మాయపల్లె గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బెజ్జంకిలో ఆరె సంఘం, తిమ్మాయపల్లెలో గ్రామస్తులు బోనాలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



తిమ్మాయపల్లెలో బోనాలతో తరలివస్తున్న మహిళలు

కనీస వేతనం అమలు చేయాల్సిందే

- అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు తప్పనిసరి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వివిధ రంగాల్లో విధులు నిర్వహించే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని టీటీసీ భవన్‌లో సీఐటీయూ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులు ప్రారంభించి చుక్క రాములు మాట్లాడారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దీనికి భిన్నంగా కార్మిక వర్గానికి దినసరి కూలి రూ.178 ఇవ్వాలని చట్టం చేయడం సరికాదన్నారు. కార్మిక వర్గాలు ఆర్థికంగా ఎదగాలంటే కనీస వేతనాలు అమలు తప్పనిసరి అన్నారు. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వేతన జీవోలను తీసుకురావాలని డి మాండ్ చేశారు. గతంలోనే 73 రకాల పరిశ్రమల వేతన జీవోలను సవరించి గెజిట్ చేసినప్పటికీ వాటిని అమలులో జాప్యం చేశారన్నారు. ఇప్పటికైనా పెరిగిన వేతనాలని అమలు చేయాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల దినసరి కూలి రూ.600 తగ్గకుండా ఇవ్వాలన్నారు. అదేవిధంగా అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక కనీస వేతనాలు అమలు కోసం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, వ్యవసాయ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, రైతు సంఘం జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ నాయక్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, కాటం మధు, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, తునికి మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గంగిరేణు చెట్టు ప్రాంగణంలో భక్తులు

భక్తజన సంద్రం.. మల్లన్న క్షేత్రం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం సందడిగా మారింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామునుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులు పట్నాలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ పైన రేణుక ఎల్లమ్మ బోనాలు సమర్పించారు. సుమారు 15వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

\- కొమురవెల్లి(సిద్దిపేట)



పట్నాలు వేసి భక్తుల మొక్కులు

క్లుప్తంగా

అభివృద్ధికి పాటుపడాలి

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే



మాట్లాడుతున్న రామారావు దేశ్‌పాండే

సదాశివపేట(సంగారెడ్డి): బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి బ్రాహ్మణులందరూ పాటుపడాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని శ్రీరామ కళామందిరంలో బ్రహ్మణ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు, మాసశివరాత్రి కార్యక్రమాలతోపాటు రూ.8 లక్షలతో సంగారెడ్డిలో జిల్లా బ్రాహ్మణ భవన నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ పాటిల్, బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు, మండల స్థాయి బాధ్యులు, బ్రాహ్మణులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

పోలీసుల అదుపులో ఆర్‌ఎంపీ డాక్టర్


మల్లేశం (ఫైల్)

సంగారెడ్డి: వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చౌటకూర్ మండల కేంద్రంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పుల్కల్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. చౌటకూర్ మండలం ఉప్పరిగూడెంకు చెందిన బైరు మల్లేశం (50) జ్వరంతో బాధపడుతూ శనివారం రాత్రి వైద్యం కోసం చౌటకూర్‌లోని ఆర్‌ఎంపీ డాక్టర్ వెంకటేశం వద్దకు వచ్చాడు. అతడిని పరీక్షించిన డాక్టర్ ఇంజక్షన్ వేశాడు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే మల్లేశం పరిస్థితి విషమంగా మారింది. వెంటనే 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. డాక్టర్ వెంకటేశం ఇచ్చిన ఇంజక్షన్ కారణంగానే మల్లేశం మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాక్టర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత


గంజాయిని చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా విక్రయిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్న ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో గంజాయి అక్రమంగా విక్రయిస్తున్నాడని సమాచారం అందింది. ఎక్సైజ్ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 295 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని బీహార్ రాష్ట్రానికి చెందిన పీయూష్ కుమార్‌ని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

గోశాలకు దూడలు


ఓ వర్గం వారితో మాట్లాడుతున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో ఆదివారం రాత్రి ఒక వర్గానికి చెందిన వారి ఇళ్ల ఎదుట రెండు దూడలను కట్టి ఉంచగా, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ఫిర్యాదు మేరకు పోలీసులు వాటిని గోశాలకు తరలించారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాలకు చెందిన వారు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. పరిస్థితి గమనించిన సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్‌ఐ రంజిత్ ఇరువర్గాల వారిని సముదాయించారు.

డేంజర్.. పూల్

స్విమ్మింగ్ పూల్‌ల నిర్వహణ గాలికి

- పూర్తి స్థాయిలో లేని లైఫ్ గార్డ్‌లు, రింగ్స్, జాకెట్‌లు
- నిబంధనలు వదిలేసి డబ్బు సంపాదనే లక్ష్యంగా కాంట్రాక్టర్
- పర్యవేక్షణ లేకపోవడంతో మృత్యువాత పడుతున్న యువత
- అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్న స్విమ్మర్స్

❒ సిద్దిపేట మారుతీనగర్‌కు చెందిన టేకుపల్లి గిరీశ్(17) ఈ నెల 11న సిద్దిపేట జిల్లా యువజన క్రీడల శాఖకు చెందిన స్విమ్మింగ్ పూల్‌కు ఈతకు వెళ్లాడు. 7 ఫీట్ల లోతు ఉన్న పూల్‌లో దూకగా లోపలే నీళ్లు మింగి ఉండిపోయాడు.. కొద్ది సమయం తర్వాత గిరీశ్ బంధువు సాయికిరణ్ చూసి పైకి తీసి సీపీఆర్ చేశాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

❒ భారత్‌నగర్‌కు చెందిన అమీర్‌సోయల్(23) గతంలో సిద్దిపేట పట్టణంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్పించే వారు ఎవరూ లేకపోవడంతో తానే స్వయంగా నేర్చుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో నీట మునిగి మృత్యువాత పడ్డాడు. జిల్లాలో ఈ రెండు ఘటనలే కాదు.... తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈత సరదా ప్రాణాలు తీస్తున్నది.

స్విమ్మింగ్ పూల్‌లు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు, యజమానులు వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో స్విమ్మర్స్ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. సిద్దిపేటలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ క్రికెట్ స్టేడియంకు సమీపంలో స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్విమ్మింగ్ పూల్ నిర్వాహణ ప్రైవేట్ వ్యక్తులు కాంట్రాక్ట్ ఇస్తున్నారు. డబ్బు సంపాదన లక్ష్యంగా చేసుకొని నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఈత నేర్చుకోవాలని వచ్చిన వారు మృత్యువాత పడుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

2016 సంవత్సరంలో పట్టణంలో రూ.5 కోట్ల వ్యయంతో 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పుతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. కొన్ని రోజులు మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగింది. తర్వాత జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగిస్తున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరుస్తున్నారు.. గంటకు రూ.100 చొప్పున, అదే నెలకు అయితే రూ.1,500 వసూలు చేస్తున్నారు.

నిబంధనలు 'నీళ్ల'పాలు

స్విమ్మింగ్ పూల్‌లో పాటించాల్సిన నిబంధనలను గాలికి వదిలేసి డబ్బు సంపాదనే ధ్యేయంగా కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పగించి డీవైఎస్‌ఓ చేతులు దులుపుకున్నారు. స్విమ్మింగ్‌పూల్‌కి అనుగుణంగా లైఫ్ గార్డులు ఉన్నారా...?, నిబంధనలు పాటిస్తున్నారా? లైఫ్ జాకెట్‌లు ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలించలేదు. పూల్‌లో లైఫ్ రింగ్స్ ప్రతీ మూడు ఫీట్లకు ఒకటి చొప్పున ఉండాలి. అలా ఉంటేఎవరైనా మునిగేటప్పుడు విసిరేస్తే పట్టుకొని బయటికొస్తారు. పూల్ దగ్గర స్టిక్స్, రోప్, నైలాన్ ట్యూబ్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఉండాలి. ఇవి స్విమ్మింగ్‌కు వచ్చే వారికి ఎంతో రక్షణగా దోహదపడనున్నాయి. కాంట్రాక్టర్ అందుబాటులో ఉంచుతున్నాడా లేదా అని డీవైఎస్‌ఓ కార్యాలయంకు చెందిన అధికారులు నిత్యం పర్యవేక్షించాలి. అలాగే టోకెన్ తీసుకునే ముందే ఈత వచ్చా రాదా... రాకపోతే కోచ్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకునే విధంగా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలి. అలా ఏమి లేకుండానే డబ్బులు చెల్లించగానే లోపలికి వెళ్లి దూకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వెంటనే అధికారులు పర్యవేక్షించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.


సిద్దిపేటలోని స్విమ్మింగ్ పూల్‌లో ఏర్పాటు చేయని లైఫ్ రింగ్స్



ఏజెన్సీనే కొనసాగిస్తుంది



ప్రతీ ఏడాది టెండర్ పిలిచి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నాం. ఈసారి సైతం టెండర్ పిలిచి ఏజెన్సీకి కేటాయించాం. నిర్వహణ బాధ్యత అంతా ఏజెన్సీ ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. స్విమ్మింగ్ పూల్‌లో అన్ని నామ్స్ ప్రకారమే ఉన్నాయి.

– నాగేందర్, డీవైఎస్‌ఓ

సీజన్‌కే పరిమితం

వేసవి కాలంలో రోజుకు 500 మందికి పైగా స్విమ్మింగ్‌కు వస్తుంటారు. కొందరు నేర్చుకుంటుండగా.. మరికొందరు నిత్యం ఆసక్తితో సాధన చేసేవారున్నారు. అందరికీ అందుబాటులో స్విమ్మింగ్ పూల్ ఉండాలనే ఉద్దేశ్యంతో నిర్మించారు. కాంట్రాక్టర్ కేవలం సీజన్ వరకే కొనసాగిస్తున్నారు. మిగితా సమయంలో తక్కువ మంది ఈతకు వస్తుడటంతో నిర్వహణ భారం పడుతుందని.. కేవలం సీజన్ వరకు మాత్రమే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్విమ్మింగ్‌కు వచ్చే వారి ప్రాణాలకు రక్షణ కోసం అన్ని సౌకర్యాలు కల్పించాలని స్విమ్మర్స్ కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలి

- 20న ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు
- 24న కలెక్టరేట్ ముట్టడి
- సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్మికుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన నర్సమ్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8 నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు తమ పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న సిబ్బంది వేతనాలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించకపోతే గ్రామపంచాయతీ యూనియన్ గా రాష్ట్ర కమిటీ కార్యాచరణ నిర్ణయించిందని తెలిపారు. ఈ నెల 18న మండల కేంద్రాల్లో, 20న ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట, 24న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. దశలవారీగా జరిగే ధర్నాల్లో కార్మికులు ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సమ్మ పిలుపునిచ్చారు.

ధాన్యం డబ్బులతో ఆన్‌లైన్ గేమ్..

- పోగొట్టుకోవడంతో యువకుడు ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


భానుప్రసాద్ (ఫైల్)

రామాయంపేట (మెదక్): ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకొని యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట నర్సింలుకు ఇద్దరు కుమారులున్నారు. రెండో కుమారుడు భానుప్రసాద్ (24) డిగ్రీ పూర్తి చేసి తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు భాను ప్రసాద్ అకౌంట్‌లో పడ్డాయి. గతంలో ఆన్‌లైన్ గేమ్‌లో కొన్ని డబ్బులు పోగొట్టుకున్న అతడు ఆ డబ్బులు మళ్లీ సంపాదించాలని వచ్చిన రూ.లక్షన్నరతో ఆన్‌లైన్‌లో గేమ్ ఆడాడు. మళ్లీ డబ్బులు పోగొట్టుకొని తీవ్ర మనోవేదనకు గురైన నాలుగు రోజుల కిందట పురుగుల మందు తాగాడు. గమనించి కుటుంబీకులు భానుప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ మోసం

రూ.13.82 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్: సైబర్ మోసానికి గురై ఓ ఉద్యోగిని లక్షల్లో నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం పోచారం గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగినికి ఏప్రిల్ 12వ తేదీన స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. ఇన్వెస్ట్ ఎలా చేయాలో నేర్పిస్తామని వాట్సాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేయగా, ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. బాధితురాలు అపరిచిత వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి అతడు చెప్పిన విధంగా నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చింది. మొత్తం పలు దఫాలుగా రూ.13 లక్షల 82 వేలు ఇన్వెస్ట్ చేసింది. స్టాక్ మార్కెట్ లో పెట్టిన నగదుతో పాటు వచ్చిన లాభాలను తిరిగి ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. హైదరాబాద్ ఈసీఎల్ చెందిన ఫెరోజ్(21) బైక్‌పై సంగారెడ్డి నుంచి సదాశివపేట వైపు వెళ్తున్నాడు. నందికంది వైపు నుంచి ట్రాక్టర్ నాగ్సాన్‌పల్లి వైపు రాంగ్ రూట్ లో వస్తుంది. ఒక్కసారిగా యూ టర్న్ తీసుకుంటూ ఫెరోజ్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దంపతులకు గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హస్తాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మానెపల్లి గ్రామానికి చెందిన గొల్ల అశోక్, అఖిల దంపతులు బైక్‌పై తూప్రాన్ వైపునకు వెళ్తున్నారు. గొర్కంటి యాదగిరి అనే వ్యక్తి హస్తాల్‌పూర్ వైపు బైక్‌పై వస్తున్న క్రమంలో మార్గమధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

గజ్వేల్‌రూరల్: ఆటోను కారు ఢీకొట్టిన ఘటన ఆదివారం గజ్వేల్ మండలం గిరిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. దౌల్తాబాద్ మండలం రాంసాగర్‌కు చెందిన అజీజ్ పాష ఆటోలో గజ్వేల్ నుంచి రాంసాగర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని గిరిపల్లి గ్రామ పెద్దగుడి సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్ పాషకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ జగదేవ్‌పూర్‌కు చెందిన ఆర్.యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తండ్రిని రోకలి బండతో కొట్టిన కొడుకు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


సత్తయ్య (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): తండ్రీ కొడుకుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని తాడూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. తాడూరు గ్రామానికి చెందిన గిరక సత్తయ్య(47) రేణుక దంపతులకు కొడుకు శివకుమార్, కూతురు నవనీత ఉన్నారు. నవనీతని అదే గ్రామానికి చెందిన పబ్బతి రాకేశ్‌కి ఇచ్చి వివాహం చేశారు. అల్లుడు ఊరిలో కొత్త ఇల్లు కడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సత్తయ్య ఇంటికి కూతురు నవనీత, రాకేశ్ తల్లి వచ్చారు. కొద్దిసేపటికి అత్తాకోడళ్ల మధ్య గొడవ తలెత్తింది. ఈ గొడవ విషయంలో సత్తయ్య, అతడి కొడుకు శివకుమార్ ఘర్షణపడ్డారు. ఆవేశానికి గురైన శివకుమార్ తండ్రిని రోకలి బండతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సత్తయ్యను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తూప్రాన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణంలోని బీడీ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. బీడీ కాలనీలో నివాసం ఉంటున్న దుర్గి శివయ్య(45) తన తండ్రి చంద్రయ్యతో డబ్బుల విషయంలో గొడవ పడ్డాడు. దీంతో మానసిక ఒత్తిడి గురై 14వ తేదీన శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శివయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థన చేస్తున్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పర్యాయాలు ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవసందేశం ఇచ్చారు. ఫాదర్స్ డే సందర్భంగా ఏసయ్య గురించి వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నారాయణఖేడ్: మనూరు మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మనూరు పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే మనూరు పోలీసుల నంబర్ 87126 56758 కి సమాచారం అందించాలని కోరారు.

పరిశ్రమ ఎదుట కార్మికుడు ఆత్మహత్య


మృతదేహంతో పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు

- డ్యూటీకి మద్యం తాగి వచ్చావంటూ పలువురు అవమానం
- మనస్తాపంతో విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు పట్టుకొని బలవన్మరణం
- హత్నూర మండలంలోని ఓ పరిశ్రమ వద్ద ఘటన


మహేశ్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): పరిశ్రమలో విధులు నిర్వహించేందుకు వెళ్లిన ఓ కార్మికుడిని కొందరు మద్యం తాగి వచ్చావంటూ అవమానించడంతో మనస్తాపానికి గురై పరిశ్రమ ఎదుట ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులోని ఎస్‌సీఎల్ బీఎల్ టెక్ పరిశ్రమ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబీకులు, స్థానికుల కథనం మేరకు.. హత్నూర మండలం సాదుల్‌నగర్ గ్రామానికి చెందిన చెక్కల మహేశ్(30) కొంతకాలంగా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి నైట్ డ్యూటీ చేసేందుకు పరిశ్రమకు వెళ్లాడు. పరిశ్రమ ప్రతినిధులు కొందరు మద్యం తాగి వచ్చావు అంటూ డ్యూటీ ఇవ్వమని చెప్పి బైక్ తాళం తీసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన కార్మికుడు మహేశ్ వెంటనే పరిశ్రమ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు పట్టుకున్నాడు. కరెంట్ షాక్ తగలడంతో స్తంభం పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

రూ.11 లక్షలు పరిహారం..

విషయం తెలుసుకున్న కుటుంబీకులు, స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశ్రమ ఎదుట పెట్టి రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఆందోళన చేపట్టారు. ఆందోళన సమాచారం అందుకున్న జిన్నారం సీఐ సుదీర్ బాబు, హత్నూర ఎస్సై సుభాష్, గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశ్రమ వద్దకు చేరుకొని మృతుడి కుటుంబీకులను, గ్రామస్తులకు నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. పోలీసులు, గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరపడంతో పరిశ్రమ తరఫున కార్మికుడి కుటుంబానికి రూ.11 లక్షలు పరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి భార్య ప్రమీలతో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

వర్షాకాలం పాములతో ఫైలం

- పంట పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం
- చిత్తడి నివాసాల్లో, పిచ్చిమొక్కల వద్ద ఎక్కువగా సంచారం
- అన్ని సర్పాలు విషపూరితం కాదు
- నాటు వైద్యంతో కాలయాపన చేయొద్దు
- జాగ్రత్తలు పాటిస్తే పాము కాటుకు దూరం



టేక్మాల్(మెదక్): కురుస్తున్న వర్షాలకు బీడు భూములు, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, గడ్డితో ఏపుగా పెరిగాయి. మురికి నీటి గుంతలు, మడుగుల్లో నీరు నిలవడంతో కప్పలు, పాములు, విషపురుగులు బయటకొచ్చి సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో రైతులు వ్యవసాయ కూలీలు, అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండేవాళ్లు, పంట పొలాలకు దగ్గరగా నివాస ప్రాంతాలున్న వారు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. గ్రామీణా ప్రాంతాల్లోని పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు పాముకాటుకు గురయ్యే అవకాశం ఎక్కువ. పాముకాటుకు గురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయట పడాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కృతిక సలహాలు, సూచనలు..

పాములు ఎక్కువగా ఉండే ప్రాంతాలు..

పొలంగట్లు, కాల్వగట్లు, వాగులు, పశువుల పాకలు, పిచ్చి మొక్కలతో నిండి పొదలు, గడ్డివాములు, పాడుబడ్డ ఇళ్లు, ఇళ్ల ముందు పేర్చిన కట్టెలు, పెంటకుప్పల్లో పాములు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఆహారం కోసం బయటకు వచ్చి ఎలుకలు, బల్లులు, తొండలు, పక్షులను తింటాయి. ఇలాంటి ప్రాణులు ఎక్కడ ఎక్కువగా సంచరిస్తాయో పాములు అక్కడ తిష్ట వేస్తాయి. నాగుపాము, కట్ల పాము, రక్తపింజర తదితర పాములు విషపూరితమైనవి. వీటి కాటుకు గురైనా బాధితులకు వెంటనే వైద్యం అందక ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా పంట పొలాలు, కాల్వల్లో తిరిగే పాములు విషపూరితమైనవి కావు. పాములకు ప్రాణభయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు, ఎవరైనా తొక్కినప్పుడు కాటేస్తాయి.


డాక్టర్ కృతిక, ఆరోగ్య ఉపకేంద్రం, టేక్మాల్

అన్ని ప్రమాదకరమైనవి కావు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. తాచు, కట్ల పాము వంటి 15 శాతం ప్రమాదకరమైన సర్ప జాతుల్లోనే విషయపూరితమైనవి ఉంటాయి. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం, ప్రమాదం లేని మాములు గాయాలే. సాధారణంగా చికిత్స తీసుకుంటే నయమవుతాయి.

ప్రథమ చికిత్స ఇలా..

- పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందొద్దు. పక్కవారు బాధితుడికి ధైర్యం చెప్పాలి.
- పాముకాటేసిన పై భాగంలో వెంటనే తాడు, గుడ్డతో బిగుతుగా కట్టాలి.
- కాటు వద్ద పదునైనా బ్లేడు గాయం చేసి రక్తం కారనివ్వాలి. నోటిలో పుండ్లు, గాట్లు లేకపోతే నోటితో రక్తం పీల్చి ఉమ్మివేయాలి.
- పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించడం, పరిగెత్తించడం చేయొద్దు.
- నాటువైద్యం పేరిట పసర్లు, వేర్లు, మంత్రాలు అంటూ కాలయాపన చేయకుండా వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- కాటేసిన పాము అంతకు ముందు ఆహారం తీసుకున్నా.. అంతకు ముందు వేరేజీవిని కాటేసిన విషప్రభావం తక్కువగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రాత్రి వేళల్లో తిరిగే వాళ్లు, అక్కడే నిద్రించే వాళ్లు టార్చ్‌లైట్‌ను వెంట తీసుకుపోవాలి.
- పాములు చేరడానికి అవకాశం లేకుండా పరిసరాలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలి.
- పెట్రోల్, కిరోసిన్, వెల్లుల్లి, ఇంగువ వాసనలను పాములు భరించలేవు. పాములు ఎక్కువగా ఉన్నాయనిపిస్తే సమయానుకూలంగా వీటిని ఉపయోగించుకోవాలి.
- రాత్రి వేళల్లో పొలాల గట్లపై, గడ్డివాముల్లో తిరిగే రైతులు, కూలీలు మోకాళ్ల వరకు రబ్బరు బూట్లు, చేతులకు రబ్బరు తొడుగులు వేసుకోవడం ఉత్తమం.
- ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు పరిసరాల్లో పిచ్చిమొక్కలు, పొదలు ఉండకుండా చూసుకోవాలి.